www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 3 సంచిక: 299 శుక్రవారం 21-11-2025 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల:5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

### జాతీయ స్థాయి కీలక ఖనిజాభివృద్ధి కమిటీలో సింగరేణి చైర్మన్



3వ పేజీలో..

### భద్రాద్రి బ్యాంక్ లో ఘనంగా 72 వ అఖిలభారత సహకార వారోత్సవాలు



5లో..

## డిసెంబర్ 11లోపు...

# స్థానిక ఎన్నికల నోటిఫికేషన్

### ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్

**12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 లోగా ఎన్నికలు పూర్తి**

**ఈనెల 24 లేదా 25న ఎన్నికల షెడ్యూల్**

**పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు..**

**50 శాతంమించకుండా డెడికేషన్ కమిషన్ సిఫారసు**

**స్థానిక రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ నివేదిక**

**పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**



**హైదరాబాద్ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఇదిలావుంటే వచ్చే నెల డిసెంబర్ 11వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. గురువారం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం మండలంలోని బస్వాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ ముందుగా గ్రామ పంచాయతీలకు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందుగా నిర్వహించకపోతే మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ల్యాప్స్ అవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రిజర్వేషన్ల ప్రకారమే 27 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు పోతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ..మిగతా 2లో



## సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం**

**జగన్ రాకతో అభిమానుల హల్‌చల్**

**హైదరాబాద్ నవంబర్ 20**

అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట ..మిగతా 2లో



## ఏపీకి మరో తుఫాను హెచ్చరిక

2



## దేశవ్యాప్తంగా... సన్నబియ్యం అందజేయండి

**పేదలు తినే బియ్యం పంపిణీ చేస్తేనే పథకానికి సార్థకత**

**కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన**

**పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి**

**హైదరాబాద్ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం ..మిగతా 2లో

## తుఫాను నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

2

## ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

**రాజీనామా చేసేందుకు మొగ్గు చూపుతున్న దానం**

**వేటు వేస్తే ఆరు సంవత్సరాల వరకు పోటీకి అనర్హులవుతారు**



**హైదరాబాద్ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాస రెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి ..మిగతా 2లో


## గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**రాష్ట్రపతి లేఖపై సుప్రీంకోర్టు కీలక తీర్పు**



**న్యూఢిల్లీ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబం ధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు ..మిగతా 2లో



## బీహార్ సీఎంగా నితీష్ ప్రమాణ స్వీకారం

**ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిన ప్రధాని మోడీ**

**హాజరైన బిజెపి ముఖ్యమంత్రులతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు**

**పాట్నా నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యారు. బిహార్‌లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా ..మిగతా 4లో

## దుబాయ్ సింగపూర్‌లతో హైదరాబాద్ పోటీ

**పక్క రాష్ట్రాలతో పోటీ పడనే పడము**

**పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక**

**తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..మిగతా 2లో

## ఆపరేషన్ సంభవ్...

# ఇక ముందూ కొనసాగుతుంది

**ఎదురు కాల్పులు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన డిజిపి**



**లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం**

**నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి రావాలి: డిజిపి**

2

## కేటీఆర్ విచారణకు

# గవర్నర్ అనుమతి

**ఇ ఫార్ములా -కారు రేసు కేసు విచారణ తిరిగి ప్రారంభం**



**హైదరాబాద్ నవంబర్ 20:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా కారు రేసుకేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జిషీట్ దాఖలు ..మిగతా 2లో

# కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి

**మొదటి పేజీ తరువాయి...**

చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే



అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్లు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

# దుబాయ్ సింగపూర్‌లతో హైదరాబాద్ పోటీ

**మొదటి పేజీ తరువాయి...**




తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసల్కైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

# లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం

### నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి రావాలి: డిజిపి

**రంపచోడవరం, నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

లొంగిపోయిన నక్సల్స్‌కు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం ఉంటుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. చాలామంది ఇప్పటికే లొంగిపోయారని, మిగతావారు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు లేని రాష్ట్రంగా చేయడమే పోలీసుల లక్ష్యమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుందని, ఆరు నెలలుగా రాష్ట్రంలో మావోయిస్టుల కోసం సంభవ్ ఆపరేషన్ పేరిట గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, అందులో భాగంగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, టెక్ శంకర్‌తో పాటు దళాలకు చెందిన 13 మంది హతమయ్యారని, 50 మందిని అరెస్టు చేశామని వివరించారు. ఇప్పటికైన మావోయిస్టుల్లో మిగిలిన వారు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలువాలని సూచించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతూనే ఉంటుందని వెల్లడిరచారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో, శాంతి భద్రతలు కాపాడేందుకు ఏపీ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# ఆపరేషన్ సంభవ్... ఇక ముందూ కొనసాగుతుంది

### ఎదురు కాల్పులు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన డిజిపి

**రంపచోడవరం నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఎకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడిరచారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు. ÷రీగా.. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డ్కెరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఆయా జిల్లాల కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# శ్రీవారి సేవలో రాష్ట్రపతి ముర్ము

**తిరుమల నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతోపాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**మొదటి పేజీ తరువాయి...**

విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# ఏపీకి మరో తుఫాను హెచ్చరిక

**అమరావతి నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):**

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం, రాబోయే 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశాలు ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ప్రమాదం పొంచి ఉందని వాతావరణ అధికారులు వెల్లడిరచారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడి పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశంముందని పేర్కొన్నారు. కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రాబోయే 24 గంటల్లో ప్రకాశం, బాపట్ల,కృష్ణా, తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడవచ్చని తెలిపారు. శని, ఆదివారాల్లో ఓ మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడిరచారు. అల్లూరి జిల్లా జి.మాడుగులలో4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోద్కెంది. ముంచంగిపట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగూడలో 7.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

**మొదటి పేజీ తరువాయి...**

స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదల్కెంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# తుఫాను నేపథ్యంలో... ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

**విశాఖపట్నం నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

తుపాను హెచ్చరికల నేపథ్యం దాన్యం కొనుగోళ్లు తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 3వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు. ధాన్యం అమ్మిన కేవలం 4 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు, పాతూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి పరిశీలించారు. 17శాతం లోపే తేమ ఉండాలనేది కేంద్రం పెట్టిన నిబంధన అని... దాన్ని మాత్రమే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతుల వద్ద నుండి ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తామని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.రైతులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రాతూరు గ్రామంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిర్రావూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల పడ్డ ఇబ్బందులను తెలుసుకొని, రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల రైతు సహాయ కేంద్రాలును కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాక, రైతుల ఖాతాల్లో మూడు గంటల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు. 4 వేల కోట్లు ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. 17 శాతం నుండి 24 శాతం వరకు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వినతి చేస్తామన్నారు. రైతుకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వ సూచనల మేరకు ముందుకు వెళ్తామని, కూటమి ప్రభుత్వం రైతుల పక్షం ఉంటుందని ఆయన తెలిపారు. 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, బస్తా 1792 రూపాయలకు కొనుగోలు చేయనున్నామన్నారు. 20369, 20389 రకం దాన్యం రైతుల నుండి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, సివిల్ సప్లై ఎండి తులసి, తాడేపల్లి తహసిల్దార్ డి సీతారామయ్య, జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**మొదటి పేజీ తరువాయి...**

లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడిరచింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండిరగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడిరచింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండిరగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాట్కెంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# సాంకేతిక అభివృద్ధికి వలసలు అవసరం

**న్యూ ఢిల్లీ నవంబర్ 20(భద్రాద్రి న్యూస్):**

అమెరికాలో సృజనాత్మకతకు వలసదారులు చోదకశక్తిగా ఉన్నారని ఆల్ఫబెట్ (గూగుల్ మాతృసంస్థ) సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. టెక్ రంగంలో వలసదారుల పాత్ర అద్భుతమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు హెచ్-1బీ వీసా విధానం రద్దుకు పట్టుబడుతున్న నేపథ్యంలో ఆల్ఫబెట్ సీఈఓ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా టెక్ రంగంలో వలసదారుల పాత్రపై ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బీబీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'టెక్ రంగం అభివృద్ధి చెందిన తీరును మీరు ఓసారి గమనించండి..ఇందులో వలసదారుల పాత్ర చాలా గొప్పది' అని ఆయన అన్నారు. హెచ్-1బీ వీసాలో లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రతిభావంతులను అమెరికాకు తీసుకొచ్చే విధంగా మార్పులు ఉంటాయని తాను భావిస్తున్నట్టు తెలిపారు. పై చదువుల కోసం అమెరికాకు వెళ్లిన సుందర్ పిచాయ్. హెచ్-1బీ వీసాతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి వలసలు అవసరమని కూడా గతంలో ఓసారి స్పష్టం చేశారు. ఇక టెక్ రంగ వ్యాపారవేత్తలకు రాజకీయ ప్రాముఖ్యత పెరుగుతుండటంపై ఎదురైన ప్రశ్నలకు కూడా సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. ట్రంప్ ప్రమాణస్వీకారంలో పలువురు టెక్ రంగ నిపుణులు పాల్గొనడంపై మాట్లాడారు. 'ఏఐ సాంకేతికత ఎంతో అద్భుతమైనది. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా కూడా ఏఐకి ఎంతో ప్రాధాన్యం ఉంది. సమాజానికి ఏఐతో ప్రయోజనాలు కలిగేలా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. సాంకేతికత దుర్వినియోగమయ్యే ముప్పుపై ప్రభుత్వంతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలోచించాలని ఆయన అన్నారు.

# దేశవ్యాప్తంగా... సన్నబియ్యం అందజేయండి

**మొదటి పేజీ తరువాయి...**

పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడిరచారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 11లోపు... స్థానిక ఎన్నికల నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి...**

రూ.92.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. స్వయం ఉపాధితోపాటు వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని.. ఇందుకోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు.

# కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణ పనులు సమీక్షించిన జిఎం .షాలేం రాజు

**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):-** ఈ వార్షిక సంవత్సరం 2025-26 లో కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణ కొత్తగూడెం ఏరియాలో నిర్వహించుటకు నిర్ణయించడమైనది. అందులో భాగంగా గురువారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆదేశానుసారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ కాలనీలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్ నందు కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణ కొరకు ప్లే గ్రౌండ్ ను మరియు క్రీడాకారుల కొరకు ఏర్పాటు చేసిన వసతి గృహాలను సంబంధిత అధికారులు డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, డిజిఎం(ఈ %డ%ఎం) ఏరియా వర్క్ షాప్ జె. క్రిస్టఫర్, డివై ఎస్ఈ (సివిల్) కే. రాజా రామ రావు, మరియు ఇతర అధికారులతో కలసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణకు ప్లే గ్రౌండ్ లెవలింగ్, కబడ్డీ కోర్ట్స్, స్టేజ్ ప్రిపరేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మన కొత్తగూడెం ఏరియా నందు నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ 28.11.2025 నుండి 30.11.2025 నిర్వహించడం జరుగుతుందని అందుకు కావలసిన పనులను ఏమాత్రం నిర్లక్ష్యము, జాప్యం లేకుండా ప్రత్యేక చొరవతో, వివిధ కమిటీలుగా ఏర్పడి కంపెనీ లెవెల్ లో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ



పోటీలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించి మరల మన కొత్తగూడెం ఏరియాలో కోల్ ఇండియా లెవెల్ క్రీడా పోటీలను నిర్వహించుటకు అనుమతులు పొందేలా ఈ క్రీడలను నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ నిర్వహణకు అవసరమైన వసతులను (గ్రౌండ్ ప్రిపరేషన్ వర్క్స్, క్రీడలను ఆడుటకు వస్తున్న క్రీడాకారులకు వసతి గృహము, భోజన వసతి మరియు కబడ్డీ కోర్ట్ ప్రిపరేషన్, సాయంత్రం సమయాలలో కూడా నిర్వహించుటకు ఫ్లడ్ లైట్ సదుపాయాము మరియు ఇతర కబడ్డీ నిర్వహణకు కావలసిన పనులను గూర్చి సంబంధిత అధికారులచే గ్రౌండ్ నందు



పర్యటించి ఎటువంటి లోటు పాటులు జరగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్, డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, డిజిఎం(ఈ %డ%ఎం) ఏరియా వర్క్ షాప్ జె. క్రిస్టఫర్, డివై ఎస్ఈ (సివిల్) కే. రాజా రామ రావు, డివై ఎస్ఈ (ఈ%డ%ఎం) టి. అనిల్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బి. భీముడు, స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ బి. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఆర్గనైజర్స్ సిహెచ్ సాగర్, మహేష్ ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన కార్తీక మాస ఉత్సవాలు

### - ఓంకార నామంతో మారుమోగిన కామేపల్లి






**కామేపల్లి,నవంబర్ 20 (భద్రాద్రిన్యూస్):** గత నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తీక మాస ఉత్సవాలు బుధవారం ఓ అత్యంత వైభవంగా ముగిశాయి బాలత్రిపుర సుందరి సమేత ఇష్టకామేశ్వరి స్వామి గల గురు మందిరంలో నెలరోజులుగా శివునికి పంచామృత అభిషేకాలు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం బిల్వర్చన నిత్య పూజా కార్యక్రమాలు తోపాటు ఆకాశదీపాన్ని ప్రతినిత్యం నిర్వహించారు అదేవిధంగా శ్రీ అవధూతేంద్ర భక్త మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం కార్తీక పురాణం శ్రవణం చేశారు దీనిలో భాగంగా ఆదివారం శివునికి మహా అన్నాభిషేకం అత్యంత వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు భక్తులు విశేషంగా పాల్గొని నిత్యం దీప ఉత్సవాలలో పాల్గొన్నారు ఈ కార్యక్రమాలలో తుంగతుర్తి సాయి రామకృష్ణ నరసింహ శర్మ నిర్వహించగా ఆలయ కమిటీ చైర్మన్ శివాజీ పర్యవేక్షించారు అనంతరం కోటగిరి రాము తదితరులు పాల్గొన్నారు

## ఆపద సమయాలలో అపన్న హస్తం అందిస్తున్న అన్నం మల్లేష్

- నిరుపేద కుటుంబాలకు ఆసరాగా
- వర్గభేధాలు లేకుండా కష్టం అన్నవారికి సహాయం
- ఆపదలో నేనున్నానంటూ చేయూత మంచి మనసున్న నాయకుడు అన్నం మల్లేష్



**సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్) :-** రాజన్న బావి గ్రామ ప్రజలు వర్షాల కారణంగా గ్రామాలలో రోడ్లన్నీ గుంతలమయంగా గత కొంతకాలంగా గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు పరిస్థితి తెలిసి గ్రామ ప్రజలు దారిన పోవాలంటే ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారు. ఇంకా వాహనదారులైతే చెప్పతరమే లేదు సమస్య తీవ్రతని తెలుసుకున్న అన్నం మల్లేష్ వెంటనే స్పందించిన అయన సుమారు లక్ష రూపాయలు తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. అంతే కాకుండా గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కొరకు స్తోమత లేని పేదవారికి తన వంతుగా సహాయం అందించి చేయూతనిచ్చాడు అంతేకాకుండా తను చదువుకున్న పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేశారు అలాగే విద్యార్థులకు నోట్ బుక్కులు బూట్లు పంపిణీ చేశారు. ఇలా అనేక కార్యక్రమాలు చేస్తూ పేదోడి కడుపు నింపుట కోసం తన వంతు సహాయం అందించడమే తనకు సంతృప్తినిస్తుందని నా వంతుగా ప్రతి పేదవారికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో



పచ్చిపాల ఐలయ్య యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షుడు,చిల్లర శంకరయ్య యాదవ్,బద్దుల అంజయ్య యాదవ్,బద్దుల పరుశు రాం యాదవ్,గంట మల్లేష్ యాదవ్,పచ్చిపాల స్వామి యాదవ్,గుత్త గోపాల్ యాదవ్,చిరగోని యాదగిరి యాదవ్,చిల్లర అంజయ్య, పచ్చిపాల కిష్టయ్య,గంట రమేష్, బద్దుల కొమురయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలాధారణ హిందువులను అందరిని ఐక్యమత్యం చేస్తుంది

**చౌటుప్పల్ నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్) :** శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం చౌటుప్పల్ లో 20/11/2025 గురువారం మాలాధారణ వేసుకున్న అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం వితరన బోయ సంజీవ-ఇందిర మాజీ ఎంపీటీసీ పంతంగి దంపతులు వారి కుమారులు అఖిల్ కుమార్ మణికంఠ వర్మ కుటుంబ సభ్యులు ఈరోజు అన్నప్రసాద వితరణ చేసినారు ఈ సందర్భంగా అన్నదాన ప్రభు మాట్లాడుతు అయ్యప్ప మాల హిందువులను అందరిని ఐకమత్యం ఉండటానికి దోహద పడుతుంది కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని స్వామి అని సంబోధిస్తూ కలిసి మెలిసి ఉంటారు అయ్యప్ప స్వామి దయతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండి ప్రతి ఒక్కరిని చల్లగా కాపాడాలని అయ్యప్ప ను కోరుకున్నారు ఈ కార్యక్రమంలో శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ గురు స్వామి వ్యవస్థాపక అధ్యక్షులు బోబ్బిళ్ళ మురళి గురుస్వామి ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు గురుస్వాములు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి పాత పాత రాజు మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం జంగయ్య గౌడ్ బోయ అంబేద్కర్ కంచరకుంట్ల వెంకటరెడ్డి సుక్క సుదర్శన్ ఉస్కాగుల నాగరాజు కుంటల శశికాంత్ పాలకూర్ల జంగయ్య గౌడ్ పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## కేటీఆర్‌పై కక్ష్యపూరిత చర్యలు..

- కాంగ్రెస్-భాజప కలసి చేస్తున్న కుట్రే: లకావత్ లక్ష్మణ్
- హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచిన ఫార్ములా రేసుపై రెండేళ్లుగా విచారణ అయినా ఏ అవకతవక బయటపడలేదని విమర్శ

**కారేపల్లి, నవంబర్ 20,(భద్రాద్రి న్యూస్):-** బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై కాంగ్రెస్%-%భాజప కలిసి కక్ష్యసాధింపు చర్యలు చేస్తున్నాయని మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. ఫార్ములా రేసు విషయంలో అవినీతి ఏదీ జరగకపోయినా, విచారణకు అనుమతి ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల దృష్టిని తమ వైఫల్యాల నుంచి మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దారి మళ్లింపు రాజకీయాలకు దిగజారారని అభియోగపెట్టారు. రెండేళ్లుగా విచారణ జరిగినా కొండ తవ్వి ఎలుక కూడా పట్టలేనిపరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ పేరు ప్రతిష్ఠలను దేశం%-%విదేశాల్లో పెంచిన ఫార్ములా రేసును కారణం చూపి ఇప్పుడు కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వం చూస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులను తప్పుడు కేసులతో కట్టడి చేయగలం అనుకోవడం కాంగ్రెస్ పార్టీ పెద్ద పొరపాటేనని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు కాంగ్రెస్



వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని, కేటీఆర్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ అండగా నిలుస్తుందని లకావత్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై మాకు సంపూర్ణ నమ్మకం ఉంది%ొ% మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటాం అని అన్నారు.

## ఫోక్సో చట్టంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలి

### - ఐసిడిఎస్ సిడిపిఓ దయామణీ




**కామేపల్లి,నవంబర్ 20 (భద్రాద్రిన్యూస్):** పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కామేపల్లి ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ ద య ా మ ణ ీ పిలుపునిచ్చారు. కామేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం పోక్సో చట్టం -2012 పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు లైంగిక వేధింపుల గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమస్యల గురించి బయటపడే మార్గాల గురించి వివరించారు. పిల్లల ప్రవర్తన పై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నెహ్రూ,ఐసిడిఎస్ సూపర్వైజర్లు లక్ష్మి, లలితమ్మ,కృష్ణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కీలక ఖనిజాభివృద్ధి కమిటీలో సింగరేణి ఛైర్మన్

**- నీతి ఆయోగ్ నియమించిన పలు ఖనిజ పరిశ్రమలలో సింగరేణికి అగ్రస్థానం**

**కొత్తగూడెం సింగరేణి ,నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):** దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న కీలక ఖనిజాలను గుర్తించడం, అన్వేషణ జరపడం ఉత్పత్తి చేయడం కోసం ఒక జాతీయ స్థాయి కమిటీని నీతి ఆయోగ్ నవంబర్ 19వ తేదీన నియమించింది. ఈ కమిటీకి ఛైర్మన్ గా ఐఐటి- ఐ ఎస్ ఎం సంస్థ అడ్వైజర్ (మినరల్స్) డాక్టర్ డీకే సింగ్ ను, కమిటీ సభ్యులుగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్ (ఐ.ఎం.ఎం.టి) డైరెక్టర్, సింగరేణి సంస్థ ఛైర్మన్ తో పాటు నైవేలీ లిగ్నైట్ కంపెనీ, కోల్ ఇండియా, గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ల ఛైర్మన్ లు ఇంకా పలు పరిశ్రమల విభాగాల నుండి మరో ఆరుగురిని సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ ఉద్దేశాన్ని నీతి ఆయోగ్ వివరిస్తూ 21వ దశాబ్దంలో కీలక ఖనిజాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని , ముఖ్యంగా ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్లలోనూ, గనుల్లోనూ, థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న ఫ్లై యాష్, బాటమ్ యాష్ లోనూ, బొగ్గు సీముల్లో ఉన్న కనీసం 10 రకాల కీలక ఖనిజాలను గుర్తించడానికి, దేశంలో కనీసం 20 ప్రదేశాలలో ఉన్న కీలక ఖనిజాల ఉనికిని తెలుసుకొని సత్వరమే అక్కడి శాంపిల్స్ ని పరిశీలించడం, అన్వేషణ జరిపించడం, ఉత్పత్తికి గల అవకాశాలను పరిశీలించడం వంటివి ఈ కమిటీ వారు అధ్యయనం చేయాల్సి ఉంటుందని, అధ్యయన నివేదికను ఏడాదిలోగా సమర్పించాలని కూడా పేర్కొంది. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత ప్రోత్సహించే విధంగా ఈ కమిటీ చురుకుగా పనిచేయాలని సూచించింది. కీలక ఖనిజాల లభ్యత, విస్తరణ ఎంత ఉంది అనేది గుర్తించి, అనంతరం శాంపిల్ అనాలసిస్ జరిపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కీలక ఖనిజాల ఉనికి నిర్ధారించబడినట్లైతే, పరిశ్రమల వారు సొంతగా కానీ లేదా ఉమ్మడి భాగస్వామ్యంతో, ఇతరులతో కలిసి గాని ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై లోతుగా అధ్యయనం చేసి సంపూర్ణ నివేదికను 12 నెలల లోగా సమర్పించమని నీతి ఆయోగ్ కోరింది. సింగరేణి సంస్థ ఇప్పటికే కీలక ఖనిజాల (%జతీఱ్‌అఎఎశ్రీ వీఱఅవతీఎశ్రీం%) రంగంలో దూకుడుగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న



నేపథ్యంలో, సింగరేణి ఛైర్మన్ను జాతీయ కీలక ఖనిజాల కమిటీలో సభ్యునిగా నియమించారు. కీలక ఖనిజాల అన్వేషణ, అధ్యయనం, భవిష్యత్ అవసరాల అంచనా, మరియు వ్యూహాత్మక ప్రణాళికల విషయంలో సింగరేణి సంస్థ చురుకుదనం, ముందడుగు చూపినందువల్లే ఈ ప్రాధాన్యత లభించినట్లు భావిస్తున్నారు. దేశ కీలక ఖనిజ ప్రణాళికలను వేగవంతం చేయడంలో, స్వదేశీ వనరుల అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల సాధనలో సింగరేణి పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో, ఈ నియామకం సంస్థ ప్రతిష్టను మరింత పెంచనుంది.

## జర్పల భద్రిని స్మరించిన నాయకులు

### కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ సీనియర్లు




**సింగరేణి,నవంబర్ 20( భద్రాద్రి న్యూస్):** సింగరేణి మండలం వెంకట్యాతండా గ్రామ పంచాయితీకి చెందిన జర్పల భద్రి గత పది సంవత్సరాలుగా అనారోగ్యంతో పోరాడుతూ ఇటీవల మృతి చెందారు. ఆయన అనంతర క్రియాక్రమాల్లో భాగంగా, భద్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తరువాత భద్రి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా పరామర్శించి ధైర్యం చెప్పిన నాయకులు సింగరేణి మండల సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, వాంకుడోత్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ గుగులోత్ కృష్ణ, యువనాయకులు గుగులోత్ శోభన్ నాయక్, మాలోత్ దేవ్ సింగ్, కడారి ఉపేందర్ (DT), బానోత్ జామ్లా నాయక్, అంగోత్ నందియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "భద్రి మరణం గ్రామానికి తీరని లోటు.. ఆయనకు దేవుడు శాంతి చేకూర్చాలి. కుటుంబానికి మా పూర్తిస్థాయి సహకారం అందిస్తాం" అని పేర్కొన్నారు.

## దశదిశ కర్మకు హాజరైన నాయకుల పాల్గొనడం గ్రామస్తులు

### ప్రజా సమస్యల పరిష్కారానికే పిఎస్ఆర్ యూత్ పంథా- ఖమ్మం ఎంపీకి వినతిపత్రం



**సింగరేణి మండలం,20( భద్రాద్రి న్యూస్):** సింగరేణి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పిఎస్ఆర్ యూత్ మరో ముందడుగు వేసింది. మండల అధ్యక్షుడు జర్పల ధోని నాయక్ ఆధ్వర్యంలో పిఎస్ఆర్ యూత్ ప్రతినిధి బృందం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రామ్ రెడ్డిని కలిసి ముఖ్యమైన ప్రజా అభ్యర్ధనలను వివరించే వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా పెరుగుతుండటంతో, శుద్ధి చేసిన త్రాగునీటిని అందించే ఆర్ఓ ప్లాంట్లను అత్యవసరంగా ఏర్పాటు చేయాలనీ, అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు బల్లలు%-%కుర్చీలు మరియు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించాలని ఎంపీకి పిఎస్ఆర్ యూత్ విజ్ఞప్తి చేసింది. ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి కట్టుబడి కృషి చేస్తోన్న పిఎస్ఆర్ యూత్ టీమ్ చర్యలను స్థానిక ప్రజలు హర్షించారు. యువత ఇలాంటి సేవా భావంతో ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. పిఎస్ఆర్ యూత్ నిరంతరం ప్రజల సమస్యలపై స్పందిస్తూ, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తోంది

## జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన 'హార్వెస్ట్' విద్యార్థిని లావణ్య ప్రహర్ష



**ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 20( భద్రాద్రిన్యూస్ ):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్, తుక్కుగూడ లో ఈనెల 16 మరియు 17 తారీఖులలో నిర్వహించిన అండర్ 19 రాష్ట్రస్థాయి బాలికల రోలర్ స్కేటింగ్ పోటీలలో హార్వెస్ట్ కళాశాల విద్యార్థిని లావణ్య ప్రహర్ష (ఇంటర్ ద్వితీయ సం.) రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పి. రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీ రెడ్డి మాట్లాడుతూ... తమ కళాశాలలో చదువుతున్న లావణ్య ప్రహర్ష తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయిలో రింక్ ఈవెంట్ లో సిల్వర్ మెడల్ మరియు రోడ్ ఈవెంట్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. అలాగే డిసెంబర్ 26 మరియు 27వ తారీఖులలో మధ్యప్రదేశ్ రాష్ట్రం, గ్వాలియర్ జరగబోయే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో పాల్గొనునున్నది. రాష్ట్రస్థాయిలాగే జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభను కనబరచాలని అభిలషించారు. ఈ సందర్భంగా వారు ప్రతిభ కనబరచిన విద్యార్థినిని అభినందిస్తూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికిఎంతగానో తోడ్పడతాయని, తమ విద్యాసంస్థలలో క్రమం తప్పకుండా క్రీడా తరగతులను ప్రతీరోజు నిర్వహిస్తున్నామని,ఒత్తిడిని తగ్గించేందుకు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కోచ్ కె. సురేష్ ను అభినందించారు.

## కస్తాల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన తాతా మధుసూదన్, సండ్ర వెంకట వీరయ్య



**ఖమ్మం ప్రతినిధి, నవంబరు 20 (భద్రాద్రిన్యూస్ ):** ఇటీవల అనారోగ్యంతో కస్తాల సత్యనారాయణ తల్లిగారు మరణించడంతో, నేడు వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకటప్పారావు, చుంచు విజయ్ కుమార్, దొండేటి అశ్వినీ కుమార్ పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం లో ఘనంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం



**ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 20( భద్రాద్రి న్యూస్):** ఖమ్మం మామిళ్లగూడెం శ్రీ చైతన్య స్కూల్ లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ను ఘనంగా నిర్వహించారు. ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ లో భాగంగా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సుజాత రెడ్డి (ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, శ్రీ గర్భ ఫెర్టిలిటీ సెంటర్), విద్యార్థులతో మాట్లాడుతూ శారీరక ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్యం, రోజువారీ జీవితంలో పాటించాల్సిన స్మార్ట్ లివింగ్ అలవాట్లపై విలువైన సూచనలు అందించారు. ఆమె సందేశం విద్యార్థులను ఎంతో ప్రేరేపించింది. అలాగే, తాను కూడా శ్రీ చైతన్య విద్యార్థినని గర్వంగా గుర్తుచేసుకున్నారు, శ్రీ చైతన్య అందించిన క్రమశిక్షణ, విలువలు తన ప్రగతికి కీలకమని విద్యార్థులతో పంచుకున్నారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల తరపున విద్యార్థులకు నాసా కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కిట్స్ శాస్త్రీయ ఆలోచన, ప్రయోగాత్మక నేర్పు, అంతరిక్ష శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేలా విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగించాయి.ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లంపాటి శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య, ఏజిఎం చేతన్, ప్రిన్సిపల్ నీరజ,అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు , హైస్కూల్ డీన్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ రేసు కేసు ఓ చిల్లర్ ఎపిసోడ్

- కాంగ్రెస్ బూటక మాటలతో పబ్బం గడుపుతుంది
- బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవి పల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ లావుడ్య పూర్ణ

ఈ రేసు కేసు ఒక టీవీ సీరియల్ ల గత రెండు సంవత్సరాలు నుండి నడుస్తున్న చల్లని చిల్లర ఎపిసోడ్ అని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవి పల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ లావుడ్య పూర్ణ అన్నారు. ఇప్పటివరకు ఈ రేస్ కేసులో కేటీఆర్ కి ఈ డి నాలుగు సార్లు విచారించి కొండని తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని అటువంటి దీనమైన స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసే పరిస్థితి లేని ఈ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రజల ముందు చీల్చి చెండాడుతున్న కేటీఆర్ మీద అనవసరమైన కేసు పెట్టి డైవర్షన్ పొలిటికల్ లో రేవంత్ రెడ్డి తెగలేపారని లావుడ్య పూర్ణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఇటువంటి నీటి మీద బుడగ లాంటి కొన్ని వందల కేసులను ఎదుర్కొన్నామని కేసీఆర్ గారి నుంచి విలువిద్య నేర్చుకున్న సైనికులమని ఎవరు అధైర్య పడద్దని నాయకులను, కార్యకర్తలను ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు...బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న పై కక్ష సాధింపు చర్యలు తగవు,

ఫార్ములా ఈ- కారు రేస్ పూర్తి పారదర్శకంగా జరిగినా,ఇందులో ఎటువంటి అవినీతి,అక్రమాలు చోటు చేసుకోకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడం శోచనీయం,హైదరాబాద్ నగరం బ్రాండ్ ఇమేజీని విశ్వవ్యాపితం చేసేందుకు అహర్నిశలు పాటుపడిన కేటీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమంగా కేసులు బనాయించడమే కాక రాజకీయంగా కక్ష సాధింపు చర్యలకు దిగడం బాధాకారం,కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్న కేటీఆర్ పై కేసులు పెట్టి గౌరవ ప్రతిష్టలను దెబ్బతీయడమే రేవంత్ ఒక పనిగా పెట్టుకున్నట్లుగా కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

దాడులు,బెదిరింపులు,కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టడం వల్ల బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్నికాంగ్రెస్ నాయకులు దెబ్బతీయలేరని,న్యాయవ్యవస్థ పట్ల తమకు



సంపూర్ణ విశ్వాసం ఉందని, కేటీఆర్ పై పెట్టిన అక్రమ కేసులను న్యాయస్థానంలో తేల్చుకుంటామని లావుడ్య పూర్ణ విషయం వ్యక్తం చేశారు.

# బాలల దినోత్సవం ఘనంగా ముగింపు వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం ,నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):-** బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు వేడుకలను గురువారం జిల్లా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో ఐడిఓసి మీటింగ్ హాల్ నందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై విద్యార్థిని లను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి భవిష్యత్తు కొరకు నిర్దిష్ట లక్ష్యాన్ని కలిగి ఉండాలని, లక్ష్యసాధనలో ఎదుర్కొనే పరిస్థితుల వలన వారు మానసికం గా దృఢం గా ఉంటారు అని తెలిపారు. మరియు క్రీడల పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి అని, ప్రతిరోజు చదువుతోపాటు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు పాల్గొనాలి అని తెలిపారు. మరియు బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. చిల్డ్రన్ హోమ్ మణుగూరు బాలికలకు స్వెటర్స్ , దుప్పట్లు వాటర్ బాటిల్స్ అందజేయడం జరిగినది. సంతకాల బ్యానర్ పై తమ తొలి సంతకం చేశారు . మూడు విశ్వామిత్ర చౌహాన్ కి జ్ఞాపిక ను ప్రశంస పత్రం అంద జేశారు . రైఫిల్ ఈవెంట్ లో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు మరియు మెడల్స్ అందజేశారు . గురుకుల పాఠశాల విద్యార్థినులు బాల్యం వివాహాల పై స్కిట్ మరియు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ( లోకల్ బాడీస్), జెడ్ పి సీఈఓ నాగ లక్ష్మి , జిల్లా సంక్షేమాధికారి



స్వర్ణలత లెనినా , ఇంచార్జ్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రసాద్ , డాక్టర్ తేజస్వి , షీ టీం ఎస్ఐ రమాదేవి , అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్ , జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి పరంధామ రెడ్డి , సిడిపిఓ లక్ష్మి ప్రసన్న పాల్వంచ ప్రాజెక్ట్, సిడిపిఓ పద్మశ్రీ కొత్తగూడెం ప్రాజెక్ట్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, సూపరింటెండెంట్ శిరీష మణుగూరు చిల్డ్రన్ హోమ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరికుమారి , వినోద్ , శేషయ్య , సఖి స్టాఫ్, డి హెచ్ ఇ డబ్ల్యు, చైల్డ్ హెల్ప్ లైన్ స్టాఫ్ , మణుగూరు చిల్డ్రన్ హోమ్ పిల్లలు , పాల్వంచ గురుకుల పాఠశాల విద్యార్థినిలు మరియు వారి సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.





# విద్యార్థులు భావితరాలకు పునాది కావాలి

- సమాజంలో ప్రతి పౌరుడు దేశ రక్షణకు నాంది పలకాలి
- ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో విద్య బుద్ధులతో మార్గదర్శి కావాలి
- రాష్ట్ర కేజీబీవీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస చారి

**కామేపల్లి,నవంబర్ 20 (భద్రాద్రిన్యూస్):** కామేపల్లి మండల పరిధిలోని కొమ్మినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను గురువారం తెలంగాణ రాష్ట్ర కేజీబీవీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస చారి సందర్శించినారు. జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల పరిశుభ్రత,ప్రత్యేక కార్యక్రమం ప్రణాళికలో చేసిన పనులను పరిశీలించినారు.పదవ తరగతి పిల్లలతో సంభాషించి విద్య యందు ఎలా ఆసక్తి పెంచుకోవాలో చిన్నయ్య సూరి కథను చెప్పి వారిని ప్రేరేపించినారు.



అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్ లో ఆరవ తరగతి పిల్లలు కనబరచిన ఆటో డ్రాయింగ్ ప్రదర్శన చూసి మెచ్చుకున్నారు.త్రీడీ ప్రింటింగ్ లో 9వ తరగతి విద్యార్థులు ప్రింట్ చేసిన నమూనాలను తిలకించారు.పాఠశాల పరిశుభ్రతను పాటించాలని విద్యార్థుల పట్ల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలని ఎప్పటికీ అప్పుడు డాక్టర్లతో మెడికల్ ఫ్రీ క్యాంపు పరీక్ష నిర్మించాలని సూచించారు. మొక్కలు నాటి పచ్చదనంతో ఉండాలని



వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని అన్నారు. తదుపరి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు.
చివరగా కొమినేపల్లి ఉన్నత పాఠశాల బోధన సిబ్బందితో గ్రూప్ ఫోటో దిగినారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కేజీబీవీ జాయింట్ డైరెక్టర్ వారి వెంట ఖమ్మం జిల్లా చీఫ్ మానిటరింగ్ అధికారి ప్రవీణ్ పాఠశాల హెచ్ఎం పి జ్యోతి ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా

# సర్వజ్ఞ విద్యార్థుల హక్కుల ప్రతిజ్ఞ

**ఖమ్మం ప్రతినిధి, నవంబరు 20 (భద్రాద్రిన్యూస్ ):-** ఖమ్మం వీడిఓస్ కాలనీ నందు గల సర్వజ్ఞ పాఠశాలలో నవంబర్ 20, అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవంను పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ, వాటిపై అవగాహన కల్పించడంలో భాగంగా, ప్రభుత్వం నిర్దేశించిన 4 రోజుల కార్యక్రమాలను పాఠశాల యాజమాన్యం విజయవంతంగా అమలు చేసింది. కుల, మత, లింగ, వైకల్య భేదం లేకుండా బాలల హక్కులను పరిరక్షించాలి ప్రతి విద్యార్థి యొక్క హక్కులను పరిరక్షించాలనే ప్రభుత్వ ఆదేశాలను సర్వజ్ఞ పాఠశాల నిబద్ధతతో నెరవేర్చింది. సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులందరూ బాలల హక్కుల ప్రతిజ్ఞ చేశారు. ప్రతి విద్యార్థి తమ హక్కుల గురించి తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవించాలని, భావి పౌరులుగా బాధ్యతాయుతంగా మెలగాలని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం యొక్క




ప్రాముఖ్యతను వివరించారు. "**Every right for Every child**," అనే థీమ్ తెలియజేశారు.ప్రతి చిన్నారికి జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు మరియు భాగస్వామ్యం హక్కులు ఉంటాయని, ఈ హక్కులను అమలు చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని అన్నారు. బాలల బంగారు భవిష్యత్తు కోసం పాఠశాల ఎప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ మరియు ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులకు బాలల హక్కులపై ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించారు. చిత్రలేఖనం, ఉపన్యాసాలు వంటి కార్యక్రమాల ద్వారా బాలల హక్కుల దినోత్సవం యొక్క ప్రాధాన్యతను పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు కృషి చేశారు.

# భద్రాద్రి బ్యాంక్ లో ఘనంగా 72 వ
# అఖిలభారత సహకార వారోత్సవాలు

**- పరస్పర సహకారంతోనే సమాజ అభివృద్ధి సాధ్యం - ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):-** ఖమ్మం పట్టణంలోని భద్రాద్రి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను నవంబర్ 14 నుండి 20 వరకు ఘనంగా నిర్వహించారు. నవంబర్ 14న బ్యాంకు ప్రధాన కార్యాలయంలో భద్రాద్రి బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి సహకార పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. బ్యాంకు సిబ్బంది సహకార గీతాలాపనతో ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. పిమ్మట ప్రతిరోజూ పరస్పర సహకారంపై మరియు సహకారం ద్వారా సమాజాభివృద్ధి పై సమావేశాలు నిర్వహించారు. గురువారం ఉదయం 11.00 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు సమావేశం "ప్రపంచ పోటీతత్వంకోసం సహకార వ్యాపార నమూనాలలో ఆవిష్కరణ" అనే అంశంపై జరిగింది. ఈ సమావేశానికి భద్రాద్రి బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధులుగా ఖమ్మం జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు జి. ఉషశ్రీ , యం. శృతి విచ్చేశారు. ముందుగా సహకార గీతాలాపన తో కార్యక్రమం ప్రారంభమయ్యింది. భద్రాద్రి బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి దాసరి వేణుగోపాల్ స్వాగత వచనాలతో సభ్యులను సభాకార్యక్రమానికి ఆహ్వానం పలికారు. భద్రాద్రి బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ... సహకార వ్యవస్థ భారతదేశం లో ప్రారంభమై 120 సంవత్సరాలకు పైగా అయినదనీ, ఎన్ని ఒడిదుడుకులెదురైనా ఇప్పటికీ మన సహకార వ్యవస్థ ధ్వజస్తంభంలా నిలబడిందనీ తెలిపారు. చేసుకుంటూ అందరూ కలసి సమాజానికి సహకరిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించడమే సహకార వ్యవస్థ యొక్క మూల సూత్రమనీ ఆయన అన్నారు. భద్రాద్రి కో-ఆపారేటివ్ బ్యాంకుగా రూపు దాల్చకముందు కో-ఆపరేటివ్ సొసైటీగా స్థాపన జరిగి పిమ్మట రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి అనుమతితో బ్యాంక్ గా మారడం జరిగిందనీ తెలిపారు. బ్యాంక్ 1997 అక్టోబర్ 04 న ఖమ్మం లో ఒక శాఖగా ప్రారంభింపబడి దినదినాభివృద్ధి చెందుతూ ఈ 28 వసంతాలలో వివిధ పట్టణాలలో 23 శాఖలుగా విరాజిల్లుతున్నదనీ, ఈ అభివృద్ధి అంతా బ్యాంక్ సభ్యుల, డిపాజిటర్ల, ఖాతాదారుల మరియు బ్యాంక్ సిబ్బంది పరస్పర సహకారం తోనే సాధ్యమయిందనీ కొనియాడారు. సాంకేతిక రంగం లో జరుగుతున్న అనేక నూతన ఆవిష్కరణాలను అందిపుచ్చుకొని బ్యాంకింగ్ రంగం కూడా సాంకేతికంగా అభివృద్ధిపథం ముందుకుపోతోందనీ అదేవిధంగా భద్రాద్రి బ్యాంక్ కూడా సాంకేతిక పరంగా అభివృద్ధి చేసుకుంటూ బ్యాంకును ఖాతాదారులకు అత్యంత చేరువలోకి తీసుకుపోతున్నామనీ, డిజిటల్ పేమెంట్స్, భద్రాద్రి యాప్ ద్వారా క్షణాలలో నగదు బదిలీ, 'ఆర్. టి. జి. యస్.' మరియు 'నెఫ్ట్' సదుపాయాలద్వారా సేవలు అందిస్తున్నామనీ ఆయన అన్నారు. ఇంతేకాకుండా పేద, మద్యతరగతి మరియు చిరువ్యాపారులకు ఋణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరిగిందనీ, ఈ చిరువ్యాపార ఋణ గ్రహీతలు త్వరితగతిన చెల్లింపులు జరిపి తమ ఋణాలు కట్టేస్తే వెంటనే మళ్ళీ వారికి ఋణ మంజూరీ చేయడం జరుగుతుందనీ తెలిపారు. గౌరవ అతిధిగా విచ్చేసిన జిల్లా సహకార సహాయ అధికారి జి. ఉషశ్రీ మాట్లాడుతూ... సహకారం అనేది ఎన్నో ఏళ్లుగా మనందరి జీవితాలతో ముడిపడి ఉన్నదనీ ఉదాహరణకి మనకేదన్న అవసరం వచ్చి మనదగ్గర ధనం లేనప్పుడు ప్రక్కవారి సహకారం అడుగుతాం. అలాగే వారికి అవసరమొచ్చినప్పుడు మనం సహకరిస్తాం. ఇది సాధారణంగా జరిగేది. అదే కొంతమంది వ్యక్తులు ఒక సంఘం గా రూపుదాలివారిలో వారు పరస్పర సహకారం అందించుకొనడం మనం అనేక సంఘాలలో చూస్తున్నాం. మత్య సహకార సంఘాలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు. ఇలా అనేక సంఘాలు వారిలో వారు సహకరించుకొంటూనే సమాజపరంగా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు అని తెలిపారు. భారత రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోడీ సహకార వ్యవస్థ అభివృద్ధికి గొప్ప చేయూతనందిస్తున్నారనీ గుజరాత్ లో సహకార విశ్వవిధ్యాలయ స్థాపన దిశగా అడుగులు పడుతున్నాయనీ కొనియాడారు. మరొక జిల్లా సహకార శాఖ సహాయ అధికారి యం. శృతి మాట్లాడుతూ... మనమిప్పుడు డిజిటల్ యుగంలో ఉన్నామనీ, ఇదివరకటి సాంప్రదాయ నగదు లావాదేవీలన్నీ చూశామనీ, వీటికొరకు మనం బ్యాంకులకు వెళ్ళి వరుసలో నిలబడి మన లావాదేవీలను పూర్తి చేసుకునేవాళ్ళమనీ, అప్పుడు మన సమాయమెంతో ఖర్చు అయ్యేదనీ కానీ ఇప్పుడు క్షణాలలో మన ఆర్థిక లావాదేవీలన్నీ పూర్తిచేసుకోవడం జరుగుతున్నదనీ అన్నారు. ఇదంతా కూడా అన్నీ రంగాలలో వస్తున్న సాంకేతిక విప్లవమేననీ అన్నారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను గమనిస్తూ సహకార బ్యాంకులు కూడా ఎప్పటికప్పుడు సాంకేతికతను తమ బ్యాంకులలో అమలు పరచుకొని ఖాతాదారులకు మెరుగైన మరియు సత్వర సేవలందించినప్పుడు వారి వ్యాపార అభివృద్ధి కూడా గణనీయంగా పెరుగుతుందనీ తెలిపారు. అన్నిరకాల సాంకేతికాభివృద్ధులను సాధిస్తూ ప్రగతి పథంలో నడుస్తున్న భద్రాద్రి బ్యాంకును ఆమె అభినందించారు. భద్రాద్రి బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి దాసరి వేణుగోపాల్ బ్యాంక్ స్థాపన, తదనంతర అభివృద్ధి, శాఖల విస్తరణ, సాంకేతికంగా బ్యాంకు డెవలప్మెంట్, డిజిటల్ ట్రాన్సాక్షన్స్, సిబ్బందికి శిక్షణ మరియు ఖాతాదారులకు అందుబాటులో సత్వర బ్యాంకింగ్ సేవలు మొదలగు విషయాలపై సోదాహరణంగా వివరించారు. ప్రస్తుతం బ్యాంకు 985 కోట్ల రూపాయల వ్యాపారం కలిగి ఉన్నదనీ, ఇప్పటికే వివిధ పట్టణాలలో 23 శాఖలు కలిగి అభివృద్ధిలో ముందున్నదనీ త్వరలోనే సిద్ధిపేట మరియు హైదరాబాద్ హయత్నగర్ లలో మరో రెండు బ్రాంచ్ లు ప్రారంభించడం జరుగుతున్నదనీ, భద్రాద్రి బ్యాంక్ తెలంగాణా రాష్ట్రంలోని ఐదవ అతిపెద్ద మరియు అభివృద్ధి చెందిన బ్యాంకుగా గుర్తింపు పొందినదనీ తెలిపారు. సాంకేతిక పరంగా అనేక రంగాలలో ఇప్పుడు ఋణవితరణ చేయడం జరుగుతున్నదనీ తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ వారి నియమ నిబంధనలకు లోబడి బ్యాంక్ తన ప్రాధాన్యతా రంగాలను ఎంచుకుంటున్నదనీ అన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన, ఎకో-ఫ్రెండ్లీ పౌల్ట్రీ ఫార్మింగ్ ఆర్ గ్రీన్ పౌల్ట్రీ తదితర రంగాలవైపు దృష్టి సారించడం జరుగుతున్నదనీ



వారికి సత్వర ఋణవితరణ చేస్తున్నామనీ, ఇప్పటికే ఇటువంటివారికి లోన్లు ఇవ్వడం జరిగినదనీ అన్నారు. బ్యాంకు సహకార సూత్రాలకు అనుగుణంగా మరియు రిజర్వ్ బ్యాంక్ వారి నియమ నిబంధనలు తూ.. చ.. తప్పకుండా వాటికి అనుగుణంగా పనిచేస్తున్నదనీ తెలిపారు. ఇప్పుడు గత నాలుగు రోజులుగా తమ బ్యాంక్ నందు రిజర్వ్ బ్యాంక్ వారి ఆడిట్ నడుస్తున్నదనీ వారియొక్క అభిప్రాయం కూడా తెలుసుకుందామనీ అంటూ రిజర్వ్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తేజడిప్త బెహెరా ని ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ... భారత దేశంలో విదేశీ బ్యాంకులు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు, రీజనల్ రూరల్ బ్యాంకులు, గ్రామీణ బ్యాంక్ లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఇలా అనేక సంస్థలు ప్రజల ఆర్థిక లావాదేవీలను నడుపుతున్నాయి. మరి ఇంకా సహకార బ్యాంకుల అవసరం ఈ దేశానికి ఉందా? ఎవరైనా చెప్పగలరా? అంటూ ఆహూతులను ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఆహ్వానితులలోని సభ్యులలో ఒక సభ్యుడు సమాధానమిస్తూ, సహకార బ్యాంకులలో సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారనీ, వారి ఆత్మీయమైన సేవలు ఎన్ని బ్యాంకులు తిరిగినా కనబడవనీ, ఫోన్ చేసినా వెంటనే సమాధానమందిస్తారానీ అలాగే సత్వర సేవలు పొందుతున్నామనీ, తమకు ఒక ఆత్మీయమైన మిత్రుడిలా సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయనీ ముఖ్యంగా భద్రాద్రి బ్యాంకు లో అకౌంట్ ఉండడం వలన తనకు ఆర్థిక క్రమ శిక్షణ అబ్బినదనీ తెలుపుతూ అందుకే ఎన్ని బ్యాంకులున్నా సహకార బ్యాంకుల అవసరం సమాజంలో ఉన్నదనీ గర్వంగా చెప్పగలననీ అన్నారు. ఆ మాటలకు సభ్యులందరూ తమ కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. వెంటనే అందుకున్న బెహెరా మాట్లాడుతూ అందుకే రిజర్వ్ బ్యాంక్ కూడా సహకార బ్యాంకుల క్రొత్త శాఖలకు త్వరితగతిన అనుమతి ఇస్తున్నదనీ సహకార రంగం ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సహకార వారోత్సవాలలో తనని పిలచి మాట్లాడించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ.. గొప్ప సందేశమిచ్చిన ఆర్. బి. ఐ. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బెహర కి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గౌరవ అతిధులుగా విచ్చేసిన జి. ఉషశ్రీ కి, యం. శృతి కి, బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి కి, బ్యాంక్ డైరెక్టర్ ఆర్. పి. చెన్ సింగ్ కి ఈ కార్యక్రమానికి విచ్చేసిన బ్యాంకు సభ్యులకు, మేనేజర్లకు, ఇతర సిబ్బందికీ మరియు ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## త్రివేణి విద్యార్థికి ఇంటర్నేషనల్ డాన్స్ & మ్యూజిక్ ఫెస్ట్ -25 లో ఘనంగా సన్మానం






**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 30 (భద్రాద్రి న్యూస్):-** నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ , సిరి ఆర్ట్స్ అకాడమీ వారు సంయుక్తంగా నిర్వహించన ఇంటర్నేషనల్ డాన్స్ & మ్యూజిక్ ఫెస్ట్ -25 లో ఖమ్మం త్రివేణి పాఠశాల 8వ తరగతికి చెందిన లక్ష్మీ తేజస్విని కి సంగీత కిరణం అవార్డు సాధించింది. కార్యక్రమం అనంతరం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీ తేజస్విని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి , లక్ష్మీ తేజస్విని ని అభినందించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... త్రివేణి విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, ఆ మార్గంలోనే విద్య ప్రణాళిక రచించబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (భద్రాద్రి న్యూస్):-** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ,ఖమ్మం కు నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి సోమ నర్సింహారావు (నరేష్ ), ఉపాధ్యక్షుడు బత్తిన నర్సింహారావు , కోశాధికారి తల్లాడ రమేష్ గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి చాంబర్ కొత్త కార్యవర్గాన్ని అభినందిస్తూ, ఖమ్మం వ్యాపారాభివృద్ధికి ,వాణిజ్య రంగాల అభివృద్ధికి ఛాంబర్ కీలకపాత్ర పోషిస్తుందని, కొత్తగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులు మరింత సేవాభావంతో పని చేసి వ్యాపార వర్గాల సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. నూతన పాలక వర్గ సభ్యులు తమను ఆశీర్వదించిన మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వ్యాపార వేత్తల కోసం పారదర్శకతతో, నిబద్ధతతో పని చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలి

**- గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డిపిఆర్ఓ**





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20( భద్రాద్రి న్యూస్):** పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలని డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ అన్నారు. డిపిఆర్ఓ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ మాట్లాడుతూ...పుస్తకాలు చదవడం వల్ల మన వ్యక్తిత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. పుస్తకాలు జ్ఞాన ధనాగారాలని, పుస్తకాలు లభించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గంథాలయంలో ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు మనసుకు దివిటిలని, భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలని డిపిఆర్వో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కటుకోజ్వల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డిపిఆర్వో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కరుణ కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్. రాజు, కార్యదర్శి ఎం.డి. ఇమామ్, ఉద్యోగులు జె. భాస్కర్, సిహెచ్. శ్రీనివాస్, వి. అఖిల్, ఎం. రోహిత్, ఎస్. లలిత కుమారి, కె. విజయకుమారి, బి. నాగలక్ష్మి, ఎం. సుమలత, కె. రవిబాబు, బి. బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల యుగంధర్ కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ



**ఖమ్మం ప్రతినిధి, నంబరు 20 (భద్రాద్రి న్యూస్):** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ,ఖమ్మం కు నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి సోమ నర్సింహారావు (Gy నరేష్ ), ఉపాధ్యక్షుడు బత్తిన నర్సింహారావు (BN), కోశాధికారి తల్లాడ రమేష్ గురువారం తుమ్మల యుగంధర్ ని మర్యాదపూర్వకంగా కలసి వారిని సన్మానించటం జరిగింది. ఈ సందర్భంగా నూతనం గా ఎన్నికైన ఛాంబర్ పాలక వర్గ సభ్యులను తుమ్మల యుగంధర్ అభినందించారు.

## నిరుపేద మహిళకు కుట్టు మిషన్ వితరణ




**ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 20( భద్రాద్రిన్యూస్ ):** వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గుట్టబడి స్కూల్ నందు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వై బుచ్చి రామారావు చేతుల మీదుగా లయన్స్ క్లబ్ సభ్యులు తిరుపతి శ్రీనివాసరావు మనవడు దీక్షిత్ పుట్టినరోజు సందర్భంగా వేముల దేవికి కుట్టు మిషన్ ను అందించారు. ఈ సందర్భంగా రీజన్ సెక్రెటరీ పెనుగొండ ఉపేందర్ రావ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా జీవనాధారం కోసం నిరుపేద మహిళలకు రాయితీ ద్వారా కుట్టు మిషన్ అందిస్తున్నామని తద్వారా వారి కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. శిక్షణ పొందిన స్త్రీలను గుర్తించి వారి కుటుంబ పోషణను దృష్టిలో ఉంచుకొని వైరా లయన్స్ క్లబ్ వారిని ఆదుకుంటూ వస్తుందని అన్నారు. నిరుపేదలకు సహాయం అందించడంలో క్లబ్బు అన్నివేళలా సహాయపడుతుందని ఈ సందర్భంగా ఉపేందర్ రావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు ట్రెజరర్ గద్దె నీరజ తిరుపతి శ్రీనివాసరావు వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## ధారావత్ లక్కను పరామర్శించిన అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి



**కామేపల్లి,నవంబర్ 20 (భద్రాద్రిన్యూస్):** ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధరావత్ లక్కు సతీమణి అకాల మరణం చెందడం జరిగినది ఆ విషయం తెలుసుకొని వెంటనే ఆ కుటుంబాన్ని పరామర్శించిన మనో ధైర్యాన్ని కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ తమకు ఎప్పటికీ అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి పండితాపురం గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకులు భూక్య నరసింహ నాయక్.మహిళ నాయకురాలు అనురాధ. వీర నాగులు. నాగరాజు. నాగేంద్రబాబు.చల్ల మల్లయ్య దొడ్ల వేణు ఆ కుటుంబ పెద్ద దిక్కైన ధరావత్ లక్క పరామర్శించడం ధైర్యం చెప్పడం జరిగింది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem - 507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046